# మైక్రోసాఫ్ట్ ఆల్‌టైమ్ రికార్డ్ ఒక్క రోజులోనే రూ.39 లక్షల కోట్లు జంప్




అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు (సుమారు రూ.39 లక్షల కోట్లు) పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా'ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం. ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్‌లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా.. టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయేమోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. అయితే మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ విజయం ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. కార్పొరేట్ ప్రపంచం ఏఐ సేవలకు భారీగా ఆర్డర్లు ఇస్తోందని, ఆ డిమాండ్‌ను అందుకోగల క్లౌడ్ సంస్థలకు ఇది బంగారు అవకాశమని నిరూపితమైంది. మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ రికార్డు వృద్ధి.. ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్ (గూగుల్) వంటి ఇతర ఏఐ ఆధారిత దిగ్గజాలపై కూడా మార్కెట్ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

# ప్రభావశీల మహిళల చేతుల్లో రూ.39 లక్షల కోట్ల ఆస్తులు



దేశంలో పారిశ్రామిక, వ్యాపార రంగాలతో పాటు పలు రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన మహిళలతో కూడిన 2026 క్యాండేర్ హురున్ ఇండియా విమెన్ లీడర్స్ జాబితా గురువారం విడుదలైంది. ఈ జాబితాలో 117 మంది మహిళలకు స్థానం లభించింది. గతేడాది జాబితాలోని 97 మందితో పోల్చితే ఈసారి 21 శాతం పెరిగారు. ఈ జాబితాలో చోటు సంపాదించుకున్న మహిళల నిర్వహణలోని సంస్థల ఎంటర్‌ప్రైజ్ విలువ, మార్కెట్ క్యాపిటలైజేషన్, సంపద రూ.39 లక్షల కోట్లుగా ఉంది. ఈ మొత్తం ఫిన్లాండ్ జీడీపీ కన్నా అధికం కావడం విశేషం. గత ఏడాది జాబితాలో 9 విభాగాలు ఉండగా.. ఈసారి 12 విభాగాలతో జాబితా రూపొందించారు. జాబితాలోని 117 మందిలో 84 శాతం మంది సొంత కష్టంతో ఎదిగినవారే కావడం విశేషం. కేటగిరీల విషయానికి వస్తే.. 'వెల్త్ మల్టీప్లయర్స్' విభాగంలో హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. ఈమె నెట్‌వర్త్ రూ.2.84 లక్షల కోట్లు. 'ప్రొఫెషనల్ సీఈఓ' విభాగంలో హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియా నాయర్ ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఈమె రూ.5,06,600 కోట్ల విలువైన కంపెనీకి నాయకత్వం వహిస్తున్నారు .
అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ప్రీతా రెడ్డి (68), సునీతా రెడ్డి (67)లు సంయుక్తంగా 'వెటరన్స్ కేటగిరీ'లో అగ్రస్థానంలో ఉన్నారు. వీరి గ్రూప్ విలువ రూ.1,21,000 కోట్లకు మించి ఉంది.
రెన్యూ పవర్ సహ వ్యవస్థాపకురాలు వైశాలి నిగమ్ సిన్హా 'న్యూ ఎకానమీ' కేటగిరీలో ప్రథమ స్థానంలో ఉన్నారు. ఈ కంపెనీ విలువ రూ.22,230 కోట్లుగా ఉంది.
ఈ జాబితాలోని వారి సగటు వయసు 48 ఏళ్లు. 19 నుంచి 86 ఏళ్ల మధ్య వయసు వారు జాబితాలో ఉన్నారు. ఈ వార్తలనూ చదవండి:

## స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు




ఈరోజు భారత స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ప్రారంభమయ్యాయి. ఆసియా మార్కెట్ల నుంచి వస్తున్న మిశ్రమ సంకేతాల మధ్య బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ రెండూ కూడా లాభాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. నిన్నటి సెషన్‌లోని లాభాలను కొనసాగిస్తూ బీఎస్ఈ సెన్సెక్స్ 78,000 పాయింట్ల మార్కును తాకే ప్రయత్నం చేయగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,300 మార్కు కంటే ఎగువన ట్రేడ్ అవుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు 77,928.15 తో పోలిస్తే, ఈ ఉదయం 77,998.66 వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలోనే 52.35 పాయింట్లు (0.07%) లాభపడి 77,980.50 వద్ద ట్రేడయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,361.45 వద్ద సానుకూలంగా ప్రారంభమై, ఆరంభ సమయంలో 24,380 మార్కును దాటింది. నేటి ప్రారంభ ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్ షేర్లు ఏకంగా 6 శాతం దూసుకెళ్లి మార్కెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి.. శ్రీరామ్ ఫైనాన్స్ వంటి ఫైనాన్షియల్ షేర్ల మద్దతుతో ముందుకు సాగుతున్నాయి. అయితే, నిఫ్టీ ఐటీ తీవ్ర విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రారంభంలోనే ఐటీ ఇండెక్స్ 3 శాతం కంటే ఎక్కువ క్షీణించింది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేర్లు 4 శాతం వరకు పడిపోయి నష్టాల వరుసలో ముందంజలో నిలిచాయి. తర్వాత కొంతమేర కోలుకునే ప్రయత్నం చేస్తున్నాయి.
మార్కెట్ బ్రెడ్త్ పరంగా ఈ ఉదయం సుమారు 1,780 షేర్లు లాభపడగా, 973 షేర్లు నష్టపోయాయి. 142 షేర్లు స్థిరంగా ఉన్నాయి. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎటర్నల్, శ్రీరామ్ ఫైనాన్స్, జియో ఫైనాన్షియల్ వంటివి లాభాలబాటలో పయనిస్తుండగా, ఇన్ఫోసిస్, టీసీఎస్ (౨జూ), హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, విప్రో వంటి షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

**అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం**

గురువారం అమెరికా మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. డౌ జోన్స్ 613.92 పాయింట్లు (1.2%) పెరిగి 52,208.06 వద్ద ముగిసింది. సాధూ 500 సూచీ 1.7% పెరిగి 7,437.64 వద్ద, నాస్‌డాక్ 2.8% పెరిగి 25,122.18 వద్ద ముగిశాయి.
మైక్రోసాఫ్ట్ 'అజూర్' క్లౌడ్ వ్యాపారంలో ఊహించని వృద్ధి నమోదవడంతో దాని షేర్లు ఏకంగా 16శాతం పెరిగాయి.. దీనివల్ల ఒక్క సెషన్‌లోనే కంపెనీ మార్కెట్ క్యాప్ దాదాపు వి450 బిలియన్లు పెరిగింది.
అమెరికా మార్కెట్ల ర్యాలీ ప్రభావం ఆసియా మార్కెట్లపైనా కనిపించింది. ఇూ× డిమాండ్ పెరగడంతో ఎస్కే హైనిక్స్, శామ్‌సంగ్ షేర్లు పుంజుకుని దక్షిణ కొరియా కోస్పీ సూచీ 16శాతం కంటే ఎక్కువ దూసుకెళ్లి ట్రేడింగ్ కూడా తాత్కాలికంగా నిలిచిపోయింది. ఆస్ట్రేలియా సాధూ/సూాశ 200, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ సూచీలు కూడా లాభాల్లో పయనిస్తున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తోడు, క్యాస్పియన్ పైప్‌లైన్ కన్సార్షియం టెర్మినల్‌పై జరిగిన దాడితో చమురు సరఫరా ఆందోళనలు మళ్లీ పెరిగాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు వి86 సమీపంలో అవుతోంది.

## రహదారులపై 4000 ఎలక్ట్రిక్ బస్సులు




**హైదరాబాద్ :** ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) కీలక మైలురాయిని అధిగమించింది. ఇప్పటి వరకు ఈ సంస్థ.. వివిధ రాష్ట్ర ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థలకు అందించిన ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 4,000కు చేరింది. హిమాచల్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (హెచ్‌ఆర్‌టీసీ) కోసం 4,000వ బస్సును తయారు చేసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్‌కు అందజేయటం ద్వారా ఈ ఘనతను సాధించినట్లు ఒలెక్ట్రా వెల్లడించింది. అంతేకాకుండా హెచ్‌ఆర్‌టీసీకి అందించిన మొత్తం బస్సుల సంఖ్య 297కి చేరిందని పేర్కొంది. కాగా ఇప్పటి వరకు మరే భారతీయ కంపెనీ ఈ స్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను దేశంలో తయారు చేయలేదని తెలిపింది.
వివిధ రాష్ట్రాల ఆర్‌టీసీలకు తాము సరఫరా చేసిన 4,000 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటి వరకు 73 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించి 6.5 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించినట్టు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తెలిపింది.

## ITRలో చిన్న పొరపాటు రూ663 కోట్లు పెనాల్టీ వేసిన ఐటీ శాఖ కానీ రూపాయి కట్టకుండా బయటకు ఎలాగంటే




ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఉద్యోగులు చేసే చిన్న పొరపాటు కొన్నిసార్లు భారీ మూల్యాన్ని చెల్లించుకునేలా చేస్తుంది. కంపెనీ నుంచి వచ్చిన పర్క్విజిట్ ఆదాయాన్ని పొరపాటున క్యాపిటల్ గేయిన్‌గా చూపించినందుకు ఒక ఉద్యోగికి ఆదాయపు పన్ను శాఖ ఏకంగా రూ.6.63 కోట్ల పెనాల్టీ వేసింది. అయితే, ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రైబ్యునల్ - ముంబై సదరు ఉద్యోగికి భారీ ఉపశమనం కల్పిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. తెలిసి ఉద్దేశపూర్వకంగా చేసిన మోసం కాదని, సద్భావనతో చేసిన సాంకేతిక పొరపాటుకు పన్ను దాచారనే నెపంతో అంత భారీ పెనాల్టీ విధించడం సరి కాదని ట్రైబ్యునల్ వ్యాఖ్యానించింది. ఐటీ శాఖ విధించిన పెనాల్టీని రద్దు చేస్తూ కీలక తీర్పు ఇచ్చింది. దీంతో సదరు ఉద్యోగికి భారీ ఉపశమనం లభించినట్లయింది.

**అసలు ఏం జరిగింది**

ముంబై వర్లీ ప్రాంతంలోని డాక్టర్ అన్నీబీసెంట్ రోడ్‌కు చెందిన క్రిష్ణన్ 2020-21 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు చెందిన కంపెనీలో వర్క్ చేశారు. ఆ సమయంలో రూ.6.44 కోట్ల శాలరీ, ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్ (ఇూూూం) ప్రయోజనాల రూపంలో ఆదాయం అందుకున్నారు. ఆ షేర్లను మూడు రోజుల తర్వాత విక్రయించగా రూ.5.67 కోట్లు వచ్చాయి. దీనిపై 20 శఅతం ట్యాక్స్ చెల్లించారు. అయితే, ఐటీఆర్ ఫైల్ చేసే సమయంలో తెలియకుండానే పొరపాటు చేశారు.
ఆదాయం రూ.6 లక్షలే.. కానీ రూ.11 లక్షలకు ట్యాక్స్ నోటీసు.. ఫ్రెండ్‌కి అప్పు ఇవ్వడం ఎంత పని చేసింది
షేర్ల విక్రయం ద్వారా వచ్చిన ఈ మొత్తాన్ని ఈ పర్క్విజిట్ మొత్తాన్ని జీతం కింద కాకుండా పొరపాటున క్యాపిటల్ గెయిన్స్ విభాగంలో నమోదు చేశారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఈ వ్యత్యాసాన్ని గుర్తించి ఉద్యోగి నిజాన్ని దాచిపెట్టి తక్కువ పన్ను కట్టేందుకు ప్రయత్నించారని భావించారు. దీనిపై సెక్షన్ 271 (1)(సి) కింద ఏకంగా రూ.6.63 కోట్ల పెనాల్టీ విధించారు. ఈ మేరకు సెక్షన్ 148 కింద ట్యాక్స్ నోటీసులు జారీ చేశారు.
కండక్టర్ ఇంట్లో నోట్ల గుట్టలు.. సదరు ఉద్యోగి ఈ పెనాల్టీని సవాలు చేస్తూ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించగా వివరాలను సమగ్రంగా పరిశీలించిన ముంబై ఐటీఏటీ బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. ఉద్యోగి తన ఫారమ్ 16లో, ఐటీఆర్‌లో కంపెనీ నుంచి వచ్చిన ఆదాయ వివరాలన్నింటినీ స్పష్టంగా వెల్లడించారు. ఎలాంటి ఆదాయాన్ని దాచలేదు. ఆదాయాన్ని కేవలం ఒక హెడ్ నుంచి మరొక హెడ్ కి మార్చి రాయడం వల్ల వచ్చిన అవగాహన లోపమే తప్ప ఇది ఆదాయపు పన్ను ఎగవేత కిందకు రాదని ట్రైబ్యునల్ పేర్కొంది. నిజాయతీగా సమాచారం ఇచ్చినప్పుడు జరిగిన ఈ వర్గీకరణ పొరపాటుకు అంత భారీ అపరాధ రుసుము విధించడం చెల్లదని స్పష్టం చేస్తూ రూ.6.63 కోట్ల పెనాల్టీని పూర్తిగా రద్దు చేసింది.

# కళతప్పిన గోల్డ్ మార్కెట్ తాజా నివేదికలో వెల్లడించిన డబ్ల్యూజీసీ

దేశీయంగా బంగారానికి ఆదరణ పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికం (క్యూ2)లో గత ఏడాది ఇదే వ్యవధితో పోల్చితే గోల్డ్ డిమాండ్ 6 శాతం క్షీణించి 131.4 టన్నులకే పరిమితమైనట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తెలియజేసింది. ఇది ఆరేండ్ల కనిష్ఠానికి సమానం కావడం గమనార్హం. ఇక నిరుడు ఏప్రిల్-జూన్‌లో 139.7 టన్నులుగా నమోదైనట్టు వివరించింది. 'క్యూ2 2026 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' పేరిట డబ్ల్యూజీసీ నివేదిక విడుదలైంది. ఇందులో బలహీనపడిన సీజనల్ డిమాండ్‌కుతోడు పెరిగిన కస్టమ్స్ సుంకం, అధిక ధరలు, పసిడి కొనుగోలుకు దూరంగా ఉండాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన పిలుపు కూడా పుత్తడికి ఆదరణను తగ్గించేశాయని డబ్ల్యూజీసీ పేర్కొన్నది. కాగా, మార్కెట్‌లో ధరలు పెరిగిన నేపథ్యంలో నిరుడుతో పోల్చితే ఈ ఏప్రిల్-జూన్‌లో వినియోగపు పుత్తడి విలువ రూ.1,98,100 కోట్లు గా నమోదైంది. ఏడాది క్రితం రూ.1,32,500 కోట్లుగా ఉన్నదని డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన జైన్ పీటీఐకి తెలిపారు. ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

## పసిడి డిమాండ్‌కు సుంకాల పోటు




**ముంబై:** భారత పసిడి డిమాండ్ జోరుకు బ్రేక్ పడింది. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో దేశంలో పసిడి డిమాండ్ 131.4 టన్నులకు పడిపోయినట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) వెల్లడించింది. గత ఆరేళ్లలో పసిడి డిమాండ్ ఎన్నడూ ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోలేదు. గత ఏడాది జూన్ త్రైమాసికంతో పోల్చినా డిమాండ్ పరిమాణం 6 శాతం తగ్గింది. దిగుమతులకు చెక్ పెట్టేందుకు ఈ ఏడాది మే నెలలో ప్రభుత్వం పసిడిపై దిగుమతి సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి పెంచడం, క్యూ2లో అమ్మకాలు పెద్దగా లేకపోవడం, విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేసేందుకు అత్యవసరమైతే తప్ప బంగారం కొనవద్దన్న ప్రధాని మోదీ పిలుపు పసిడి డిమాండ్ తగ్గడానికి ప్రధాన కారణమని డబ్ల్యూజీసీ తెలిపింది.

**విలువపరంగా రికార్డ్**

క్యూ2లో పరిమాణపరంగా పసిడి డిమాండ్ తగ్గినా.. విలువపరంగా చూస్తే మాత్రం సరికొత్త రికార్డు నమోదైంది. ఈ కాలంలో భారత్‌లో రికార్డు స్థాయిలో రూ.1,98,100 కోట్ల విలువైన పసిడి అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 50 శాతం ఎక్కువ. 'ధరలు అధికంగా ఉన్నా వినియోగదారులు పసిడి కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు అనేందుకు ఇదే నిదర్శనం' అని డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈఓ సచిన్ జైన్ తెలిపారు. పరిస్థితులు ఎలా ఉన్నా ఈ ఏడాది భారత పసిడి డిమాండ్ 650 నుంచి 750 టన్నుల వరకు ఉండొచ్చని డబ్ల్యూజీసీ అంచనా. 'ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఇది మధ్యస్థంగా 700 టన్నుల వరకు ఉండవచ్చు. ఒకవేళ ధరలు దిద్దుబాటుకు లోనై.. ప్రభుత్వం సుంకాలు తగ్గిస్తే మాత్రం డిమాండ్ 750 టన్నులకు సునాయాసంగా చేరుతుంది' అని సచిన్ జైన్ చెప్పారు.

**పెరిగిన స్మగ్లింగ్**

పసిడిపై దిగుమతి సుంకాలు పెంచడంతో స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఒక్కో ట్రిప్పుకు దాదాపు 18 శాతం లాభం ఉండడంతో ఏదోలా..అధికారుల కళ్లు గప్పి దుబాయ్, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాల నుంచి బంగారాన్ని భారత్‌కు తరలిస్తున్నట్టు డబ్ల్యూజీసీ తెలిపింది.
ఈ ఏడాది మే 13 నుంచి జూన్ నెలాఖరు వరకు స్మగ్లర్ల నుంచి 160.91 కేజీల బంగారం స్వాధీనం చేసుకోవడమే ఇందుకు ఉదాహరణ. గత ఏడాది ఇదే కాలంలో స్వాధీనం చేసుకున్న 86.16 కిలోలతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. 'పసిడి మార్కెట్‌కు స్మగ్లింగ్ పెద్ద దెబ్బ. పెరుగుతున్న ఈ స్మగ్లింగ్‌పై మాకు ఇప్పటికే వార్తలు అందుతున్నాయి. వచ్చే త్రైమాసికాల్లో మేము దీనిపై మరింతగా దృష్టి పెడతాం' అని సచిన్ జైన్ తెలిపారు.